andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.9, కనిష్ఠం 27.7





కాల్వ ద్వారా ప్రవహిస్తున్న ప్రాజెక్టు నీరు

'చి'వరి' తడులకు గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి
సాగు నీటి విడుదల

భైంసా, ఏప్రిల్7: ఆయకట్టు పరిధిలో సాగులోనున్న వరిపైరుకు చివరి తడులు అందించేందుకు గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువ ద్వారా నీటిని విడుదల చేసినట్లు ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరిపైరు చివరి దశకు చేరుకున్న దృష్ట్యా నీటి తడుల అవశ్యకతపై ఆయకట్టు రైతాంగం చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. స్పందించిన ప్రభుత్వం ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేయాలని ఇర్రిగేషన్ అధికారులకు సూచించిందని తెలిపారు. ఇందులో భాగంగానే శనివారం సాయంత్రం నుంచి ప్రధాన కాల్వ ద్వారా ఆయకట్టు భూములకు 20 క్యూసెక్కుల నీటిని గడ్డెన్నవాగు ప్రాజెక్టు నిర్వాహణాధికారులు విడుదల చేసినట్లుగా పేర్కొన్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, 1.852 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 356.5 మీటర్లు, 0.906 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఇందులో నుంచి ఇదివరకే రోజు 20 క్యూసెక్కుల నీటిని మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు, శనివారం నుంచి మరో 20క్యూసెక్కుల నీటిని ఆయకట్టు భూములకు సాగునీటిని అందించేందుకు విడుదల కొనసాగుతోంది.

'వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'

సారంగాపూర్, ఏప్రిల్7: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది మళ్లీ మోదీ నేతృత్వంలో అధికారంలోకి వస్తుందని బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులురావుల రాంనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని ఆలూర్‌లో లాభార్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన వీధుల్లో ఇంటింటా తిరుగుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి పథకాల క్యాలెండర్‌ను, కరపత్రాలను లబ్ధిదారులకు అందిస్తూ బీజేపీకి ఓటు వేసి నరేంద్ర మోదీని హ్యాట్రిక్ ప్రధాన మంత్రిగా చేయాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిదని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేస్తే అవినీతే రాజ్యమేలుతుందని అన్నారు. ఈయనవెంట నాయకులు వెంకటేష్, చాణక్య, చిన్నయ్య, బ్రహ్మయ్య, నవీన్, భోజన్న ఉన్నారు.



కరపత్రాలను అందిస్తున్న దృశ్యం

డీసీసీ అధ్యక్షుడి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు (ఫైల్)



సమన్వయంపైనే కాంగ్రెస్ నజర్!





- గెలుపు కోసం కోఆర్డినేటర్ల నియామకం
- నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున అంతర్గత పరిశీలకులు
- క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్ష
- ప్రతీరోజు పార్టీ అధిష్ఠానానికి రిపోర్టులు
- పాత, కొత్త నేతల ఐక్యతపై దృష్టి



నిర్మల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పకడ్బందీగా వ్యూహరచన చేస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా ఈసారి కాంగ్రెస్ తమ ఎన్నికల వ్యూహాలను అమలు చేసేందుకు పకడ్బందీగా కార్యచరణ రూపొందించింది. ఇందులో భాగంగానే ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో కోఆర్డినేటర్‌ను నియమించింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కుదర్చడమే కాకుండా ఇటీవలే పార్టీలో చేరిన నాయకులు, సీనియర్ నేతల మధ్య అభిప్రాయ బేధాలు లేకుండా సత్సంబంధాలు కొనసాగేట్లు ఈ కోఆర్డినేటర్లు చర్యలు తీసుకోనున్నారు. జిల్లాస్థాయి సీనియర్ నాయకులతోపాటు గ్రామ, మండలస్థాయి నాయకులతో సైతం కోఆర్డినేటర్లు ప్రతిరోజూ టచ్‌లో ఉంటూ పార్టీ పరిస్థితిపైనా కాకుండా ప్రత్యర్థి పార్టీల కార్యకలాపాలపై కూడా వీరు దృష్టి కేంద్రీకరించనున్నారు. వీరితోపాటు క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకే కాకుండా పార్టీ పరమైన లోపాలను అధిగమించేందుకు అవసరమయ్యే సలహాలు అందించేందు కోసం ప్రతీ నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున అంతర్గత పరిశీలకులను సైతం నియమించింది. వీరు క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులను పరిశీలించి ప్రతిరోజూ అధిష్ఠానానికి నివేదికలు అందించనున్నారు. ఈ నివేదికల ఆధారంగా అధిష్ఠానం స్థానిక నేతలకు రాజకీయవ్యూహాలతో కూడిన దిశా నిర్దేశం చేయనుందంటున్నారు. అయితే గత కొద్దిరోజుల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ నేతలతో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు వరుస కట్టి చేరుతున్న సంగతి తెలిసిందే. రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీలో చేరికలు పెరిగిపోతుండడం ఓ వైపు ఆ పార్టీకి కొత్త ఊపునిస్తుండగా మరోవైపు ఆధిపత్య పోరుకు ఆస్కారమిచ్చే అవకాశం ఉందంటున్నారు. దీని కారణంగానే పార్టీలోని సీనియర్ నాయకులు అలాగే ప్రస్తుతం చేరుతున్న ఆయా పార్టీల నేతల మధ్య సమన్వయం కుదుర్చేందుకు కూడా అధిష్ఠానం ప్రయత్నాలు మొదలుపెట్టిందంటున్నారు. వీరిమధ్య ఐక్యతను నెలకొల్పి జిల్లాలో పార్టీని మరింత పటిష్టవంతం చేయడమే కాకుండా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంటోంది. ఎలాగైనా జిల్లావ్యాప్తంగా ఆధిపత్యం నిలుపుకొని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెక్ పెట్టాలని ఆ పార్టీ భావిస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ జిల్లాలో పూర్తిగా బలహీన పడిన కారణంగా ఆ పార్టీ స్థానంలో తమ పార్టీని నిలిపేందుకు నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. బీజేపీకి కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఇక గట్టి ప్రత్యర్థి కాబోతోందని అంటున్నారు. మొత్తానికి ఓ వైపు బీఆర్ఎస్ పూర్తిగా బలహీన పడడం, మరోవైపు ఆ పార్టీకి చెందిన నేతలంతా వరుస కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంతో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగనుందంటున్నారు.

ప్రత్యర్థి పార్టీల కదలికలపై దృష్టి

ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ నెలకొనబోతోంది. ఇప్పటికే బీఆర్ఎస్‌కి చెందిన చాలామంది సీనియర్ నాయకులు, కార్యకర్తలు అంతా ఆ పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరుతున్నారు. దీని కారణంగా బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం డీలా పడిపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ ఉండబోతోందని పరిశీలకులు చెబుతున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎలాగైనా ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని గెలుచుకునేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తోంది. తన సమీప ప్రత్యర్థిగా భావిస్తున్న బీజేపీ కదలికలపైనే కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా ఫోకస్ పెడుతోంది. ఆ పార్టీలోని బలహీనతలన్నింటిని అనుకూలంగా మలుచుకునేందుకు కాంగ్రెస్ ముందస్తు వ్యూహరచన రూపొందిస్తోంది. మైనారిటీ ఓట్లతో పాటు మహిళలు, యూత్ ఓట్లను మెజార్టీగా సాధించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా పావులు కదుపుతోంది. ఈ సారి బీఆర్ఎస్ పార్టీ నామమాత్రపు పోటీ ఇవ్వబోతుందన్న సంకేతాలతో కాంగ్రెస్ పార్టీ మరింత దూకుడు పెంచి మైనార్టీ ఓట్లను గంపగుత్తగా కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతోంది. దీంతో పాటు ఉద్యోగ నియామకాలను అస్త్రంగా మలుచుకుంటూ యూత్‌ఓట్లను భారీగా కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఉచిత బస్సు సౌకర్యంతో పాటు మహిళల కోసం అమలు చేస్తున్న గృహలక్ష్మి తదితర పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ మహిళల ఓట్లను భారీగా సాధించాలని కాంగ్రెస్ ఎత్తులు వేస్తోంది. దీంతో పాటు బీజేపీ పార్టీలోని అసమ్మతి, అసంతృప్తి వాదులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు కూడా కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిందంటున్నారు. అలాగే బీజేపీ నేతలపై స్థానికంగా ఉన్న వ్యతిరేఖతను కూడా అనుకూలంగా మలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోందంటున్నారు.

నియోజకవర్గాల కోఆర్డినేటర్లు వీరే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్లను నియమించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇటీవలే విడుదల చేశారు. సిర్పూర్ నియోజకవర్గానికి జువాజీ అనిల్‌గౌడ్, చెన్నూర్ నియోజకవర్గానికి హైమావతి, బెల్లంపల్లి నియోజకవర్గానికి మహమ్మద్ ఖలీద్, మంచిర్యాల నియోజకవర్గానికి వేముల కృష్ణ, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి రామ్‌శెట్టి నరేందర్ నాయుడు, ఆదిలాబాద్ నియోజకవర్గానికి వైద్యుల అంజన్ కుమార్, అర్జుమన్‌అలీ, బోథ్ నియోజకవర్గానికి సత్తు మల్లేష్, నిర్మల్ నియోజకవర్గానికి క్యామే అనిల్‌కుమార్, ముథోల్ నియోజకవర్గానికి ఈ. వెంకట్ రాంరెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గానికి మల్సూరి సత్యనారాయణ, జునైద్ మేమన్‌లను ఇంచార్జీలుగా నియమించారు. వీరంతా పార్టీలో సీనియర్ నేతలుగా గుర్తింపు పొందడమే కాకుండా అప్పట్లో బీఆర్ఎస్ పార్టీని నిలువరించేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి పార్టీలో గుర్తింపు పొందారు.

అడెల్లి పోచమ్మకు ఎమ్మెల్యే పూజలు



- అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్, ఏప్రిల్7: మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మొక్కులను మొక్కి పూజలు చేశారు. ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేసి హారతిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఆలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈయనవెంట బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, కరిపే విలాస్, వెంకటేష్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా జునైద్ మెమన్

ఖానాపూర్, ఏప్రిల్ 7: కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా జునైద్ మెమన్‌ను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. పార్టీకి 2011 నుంచి అనేక హోదాలలో సేవలందించిన ఆయనను ఖానాపూర్ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా నియమించడం పట్ల జునైద్ మెమన్ కృతజ్ఞతలు తెలిపారు. 2011లో కాంగ్రెస్‌లో చేరిన జునైద్ మెమన్ 2012లో మైనార్టీ యూత్ అధ్యక్షుడిగా 2014లో నిర్మల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, 2017లో యువజన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా, 2020లో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులుగా పనిచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ మెజార్టీ పార్లమెంట్ స్థానాలను గెలుచుకుంటుందని పేర్కొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి మృతి

సారంగాపూర్, ఏప్రిల్ 7: మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన షేక్ ఈసా (45) ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షేక్‌ఈసా తాగుడికి బానిసై జీవితం మీద విరక్తి చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కవితలకు ఆహ్వానం

ముథోల్, ఏప్రిల్7: ఉగాది పండుగను పురస్కరించుకొని ఉగాది పండుగ విశిష్టత గురించి కవితలను ఆహ్వానిస్తున్నట్లు శ్రీ హంస వాహిని సాహిత్యకళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు జాదవ్ పుండలిక్‌రావు పాటిల్, పీసర శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల కవులు ఈనెల తొమ్మిదో తేదీలోపు కవితలను పంపాలని పేర్కొన్నారు. వచన కవిత 16 వరుసలకు మించకుండా, పద్యకవిత్వం నాలుగు పద్యాలకు మించకుండా తెలిపారు. కవితలు సెల్ నంబర్: 8125018531, 99492 58231కి పంపాలని వారు పేర్కొన్నారు.

నంది అవార్డు గ్రహీతలకు సన్మానం

నిర్మల్‌టౌన్, ఏప్రిల్7: నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా.వేణుగోపాలకృష్ణ ఉత్తమ దర్శకుడిగా నందిపురస్కారం పొందారు. ప్రేమతో నాన్న ఉత్తమ లఘు చిత్రంగా, సుహాసిని ఉత్తమ నటిగా అవార్డులు లభించాయి. హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరు నంది పురస్కారాలను అందుకున్నారు. నిర్మల్ గౌరవ శాసనసభ్యులు బీజేపీ శాసన సభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి డా.వేణుగోపాలకృష్ణ వైద్యసేవలను అభినందిస్తూ కళారంగాల్లో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చంద్రకాంత్, బీజేపీ నాయకులు ముత్యంరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆలయంలో విగ్రహాల ధ్వంసం

- పోలీసులకు గ్రామస్థుల ఫిర్యాదు

బాసర, ఏప్రిల్ 7: బాసర మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపాన గల చింతమణి గణేష్ మందిరంలో నాగదేవత, నంది విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం ఆలయానికి వెళ్లిన గ్రామస్థులు గమనించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నంది విగ్రహం కొమ్ములను, నాగ దేవత రాతి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో ఈ మేరకు గ్రామస్థులు బాసర పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే బాధ్యులను పట్టుకుంటామని ఎస్సై గణేష్ వెల్లడించారు.



ఆలయంలో ధ్వంసమైన నంది విగ్రహం



మండల పూజలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మండల పూజ

కుంటాల, ఏప్రిల్ 7: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో ఇటీవల నూతనంగా నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన శివాలయంలో ఆదివారం మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో విగ్రహా ప్రతిష్ఠాపన ముగిసి 41 రోజులు గడిచిన సందర్భంగా ఈ మండల పూజ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. కార్యక్రమానికి గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

కుంటాల, ఏప్రిల్ 7: కుంటాలలోని స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో ఆదివారం పాఠశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశం కోసం ఉదయం, సాయంత్రం నిర్వహించిన పరీక్షల్లో మొత్తం 1038 మంది విద్యార్థులకు గాను ఉండగా 780 మంది పరీక్ష రాయగా, 258 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు శ్రీనివాస్ ప్రసాద్, శ్రీకాంత్, డీవోలు రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పరీక్ష ఫలితాలు త్వరలోనే వెలువడుతాయని వారు పేర్కొన్నారు.

వానరాల దాడులతో బెంబేలెత్తిపోతున్న ప్రజలు

- రెండు రోజుల వ్యవధిలో నలుగురిపై దాడి
- ఆసుపత్రి పాలైన వృద్ధురాలు

భైంసా, ఏప్రిల్7: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసావాసులు వానరాల దాడులతో బెంబేలెత్తిపోతున్నారు. రెండురోజులుగా వీటి బెడదతో అధికమవ్వడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. శని, ఆదివారాల్లో పట్టణ పరిధిలోని బ్రహ్మణ్‌గల్లి, గోపాల్ కృష్ణ మందిర్ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులపై వానరాలు దాడులు చేశాయి. ఇందులో బ్రహ్మణ్‌గల్లి ప్రాంతానికి చెందిన పుష్ప ఆసుపత్రి పాలైంది. వానరం వృద్ధురాలి చేయి కొరకడంతో తీవ్ర గాయమైంది. సమీప ప్రాంతవాసులు వృద్ధురాలిని వైద్యసేవల నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహింపచేశారు. రెండురోజులుగా వానరాలు పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో స్వైర విహారం చేస్తున్నాయి. తలుపులు తెరిచిఉన్న ఇళ్లలోకి చొచ్చుకరావడం, వంట గదుల్లోకి వెళ్లి అక్కడి ప్రాంతంలోని తినుబండరాలు ఎత్తుకెళ్లడం, వాటిని తరిమేసేందుకు యత్నించిన వారిపై దాడిచేయడం, వీధుల్లో తిరగడం, కనబడిన వారిపై ఎగబడటం లాంటి చర్యలకు పాల్పడుతుండటంతో పట్టణవాసులు భయాందోళనలు చెందుతున్నారు. గుంపులు గుంపులుగా వస్తున్న వానరాల మూక ఇళ్ల ప్రహరీల నుంచి లోనికి దూకి ఇళ్లలోకి వచ్చి బెంబేలెత్తిస్తున్నాయి. వాటి బెడదతో కొంత మంది దినం వేళల్లో సైతం తలుపులు వేసి ఉంటున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది. మున్సిపల్ అధికార, పాలక వర్గాలు వానరాల బెడద నుంచి తమను కాపాడాలని చేయాలని పట్టణవాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.



ఓ ఇంటి ప్రహరీపై వానరాలు



వానర దాడితో గాయపడ్డ వృద్ధురాలు



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ

తాత్కాలిక బస్ స్టాప్ కోసం స్థల పరిశీలన

ఖానాపూర్, ఏప్రిల్7: మండలకేంద్రంలోని విద్యానగర్ కాలనీలో తాత్కాలిక బస్ స్టాప్ నిర్మాణం కోసం ఆదివారం ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యానగర్‌కాలనీలో తాత్కాలిక బస్‌స్టాప్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా బస్ స్టాప్‌ను తొలగించినప్పటి నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక బస్‌స్టాప్‌ను నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు జన్నారపు శంకర్, పరిమి సురేష్, తదితరులు ఉన్నారు.

10 నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నల కొనుగోళ్లు

- ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్

భైంసా, ఏప్రిల్7: నియోజకవర్గ పరిధిలోని రైతాంగానికి ప్రభుత్వం ద్వారా మద్ధతు ధర కల్పించేందుకు గాను ఈ నెల 10 నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా జొన్న కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించనున్నారని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ తెలిపారు. ఆదివారం భైంసాలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జొన్న రైతాంగానికి చేయూతనిచ్చేందుకు కుభీర్ మండలకేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ముందుగా ప్రారంభిస్తామని చెప్పారు. మార్కెట్‌లో ప్రస్తుతం జొన్నకు తక్కువ ధర లభిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధర రూ.3180తో కొనుగోళ్లు చేట్టనున్నట్లు తెలిపారు. జొన్న రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

సోనారిలో మద్యం పట్టివేత

కుభీర్, ఏప్రిల్7: మండలంలోని సొనారి గ్రామంలో ఆదివారం నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న బెల్టుషాపులో మద్యం పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. గ్రామానికి చెందిన పూజేకర్ పండరి బెల్టుషాపులో తనిఖీ చేపట్టి షాపులోని నిల్వ చేసిన రూ.4100 విలువ గల 8.75 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవీందర్ తెలిపారు.



పట్టుబడ్డ మద్యంతో పోలీసులు

'ప్రజల్లో ధ్యాన చైతన్యాన్ని నింపాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 7: ప్రజల్లో ఆధ్యాత్మిక, ధ్యానచైతన్యాన్ని నింపేందుకు ఆధ్యాత్మిక, ధార్మిక సంస్థలు ఒకే వేదికగా పని చేయాల్సి ఉందని శ్రీరామచంద్ర మిషన్ జోనల్ కోఆర్డినేటర్లు షరీఫ్, కృష్ణరావు పిలుపునిచ్చారు. శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఆధ్యాత్మిక సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మతాలు, ధార్మిక సంస్థలు ప్రపంచ శాంతి కోసం కృషి జరపాలని కోరారు. ఇందులో శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి శ్రీయోగానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఆయా సంస్థల ప్రతినిధులు



ప్రమాదానికి కారణమైన లారీ



గాయపడ్డ వ్యక్తి

లారీ, బైకు ఢీ: వ్యక్తికి గాయాలు

నర్సాపూర్(జి), ఏప్రిల్7: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీ టీఎస్ 16 యూబీ 5520ని దిలావార్‌పూర్ నుంచి అంబకంటి వైపు రైడర్ బైకుపై వెళ్తున్న అంబకంటి రాజు, దిలావార్‌పూర్ మురేశ్ లారీ ముందర టైరును ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. రైడర్ బైకు ముందు చక్రం ఊడిపోవడంతో రోడ్డు బయట పడిపోయారు. ఈ ప్రమాదంలో దిలావర్‌పూర్ మురేశ్ కాలు విరగడంతో స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారవడంతో పోలీసులు లారీని పీఎస్‌కు తరలించారు. రాంపూర్ బీడీఫ్యాక్టరీ ముందు తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రాంపూర్ ప్రజలు వాపోతున్నారు.

సుర్రుమంటున్న సూర్యుడు

● రికార్డు స్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు

● 44 డిగ్రీలకు పైగా నమోదు ● వడగాలులతో అల్లాడుతున్న జనం

నిర్మల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆదివారం జిల్లా వ్యాప్తంగా భానుడి ప్రతాపం కనిపించింది. ఎండ వేడిమికి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో నిర్మల్ రూరల్ మండలంలోని ముజ్గిలో 42.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా మామడ మండలం తాండ్రలో అత్యల్పంగా 38.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు భారీగా నమోదువుతుండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఆసిఫాబాద్: రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండగా జిల్లాలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగవచ్చని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరి కలు జారీ చేసింది. ఆదివారం జిల్లాలో 44.4డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మధ్యాహ్నం ఎండవేడిమి ఎక్కువగా ఉండడంతో జనాలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఉదయం 9గంటల నుంచే ఎండ అధికమై ఉక్క పోతతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో తాగునీటి కోసం మూగజీవాలు అల్లాడుతు న్నాయి. చెరువులు, కుంటలు, బావులు అడుగం టుతున్నాయి.

జిల్లాలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు..

జిల్లాలో ఆదివారం 44.4డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెంచికల పేట మండలంలో 44.4డిగ్రీలు, రెబ్బెన, కాగజ్‌నగర్, దహెగాంలలో 43.9డిగ్రీలు, కౌటాలమండలంలో 43.5డిగ్రీలు, తిర్యాణిమండలంలో 43.1 డిగ్రీలు, బెజ్జూరు మండలంలో 42.4డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో 42.3 డిగ్రీలు, కెరమెరిమండలంలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

డీఎంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 7: ఆసిఫాబాద్ డిపోలో పల్లెవెలుగు బస్సులను ఉపయోగిస్తూ ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తున్న డిపోమేనేజర్ విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూ సీనాయకుడు ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈవిషయంలో ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదుచేస్తామని తెలిపారు.



● పంటకు చివరి తడి కోసం రైతుల పాట్లు



● బాసర గోదావరిలో అడుగంటిన జలాలు



ఎడారిగా గోదావరి !

● పుణ్యస్నానాలకూ నీరు లేక షవర్ల ఏర్పాటు

● పంటలకు నీరందించేందుకు నది నుంచి కాల్వలు తీస్తున్న రైతులు

బాసర, ఏప్రిల్ 7: బాసర వద్ద గోదావరి ఏడారిగా మారిపోతోంది. ప్రస్తుతం నదిలో జలాలు అడుగంటిపోయాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు నీటి నిల్వలు వేగంగా కరిగిపోతున్నాయి. కనీసం భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి తగినంత నీరులేదు. దీంతో దేవస్థానం అధికారులు భక్తుల కోసం నీటి షవర్లను ఏర్పాటు చేశారు. నదిలో చాలా వరకు ఇసుక మెటలు తేలాయి. మరోపక్క పంటలకు నీరు అందించేందుకు రైతన్న ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎత్తిపోతల పథకం వద్ద నదిలో నీరు అందకపోవడంతో కాల్వ తీసి ఉన్న కాస్త నీటిని పంపుహౌజ్‌లోకి పంపిస్తున్నారు. ఇలా రైతన్నలు వంతుల వారిగా ముందుకు వచ్చి పంటలను రక్షించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాసర క్షేత్రంలో మొత్తానికి ఈసారి గోదారి ఎండిపోయి బోసిపోతోంది.

ఎస్సారెస్పీ సాగునీటి సరఫరాపై నీలి మేఘాలు!

● ఆందోళనలో ఆయకట్టు రైతులు ● ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్న అన్నదాతలు



నీటి సరఫరా నిలిచిన ఎస్సారెస్పీ కెనాల్

లక్ష్మణచాంద, ఏప్రిల్7: ఎస్సారెస్పీ సాగునీటి సరఫరాపై నీలిమేఘాలు కమ్ముకుంటున్నాయి. శ్రీరాం సాగర్ జలాశయంలో ప్రస్తుత నీటి నిల్వ కేవలం 12.5 టీఎంసీలు మాత్రమే ఉంది. గత సంవత్సరం ఇదే సమయంలో 25 టీఎంసీలు ఉన్న నీటి మట్టం 12.5 టీఎంసీలకు తగ్గిపోవటం వలన సాగునీటి కాలువలన్నింటికీ నీటి సరఫరా నిలిపి వేయమని రాష్ట్రస్థాయి అధికారులు ఆదేశించినట్లు స్థానిక ఎస్సారెస్పీ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని భవిష్యత్ త్రాగునీటి అవసరాలకు రిజర్వ్‌లో ఉంచనున్నట్లు సమాచారం. దీంతో ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ రబీలో మండలం మొత్తం మీద 11,850 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ఇందులో 6,500 ఎకరాల వరిసాగు ఎస్సారెస్పీ కెనాల్ సాగు నీటిపై ఆధారపడి ఉంది. మిగతా సాగు విస్తీర్ణం కూడా బోరు బావులు, చెరువుల క్రింద సాగవుతున్నప్పటికీ పరోక్షంగా ఎస్సారెస్పీ సాగునీరే ఆధారం. ఈ నీరు సరఫరా అయితేనే చెరువులలోను, బోరు బావులలోనూ నీరు ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంట ధాన్యం ఉత్పత్తి (ఈనటం) అవుతున్న దశలోనే ఉంది. ఇంకా కనీసం 20 రోజులపాటు నీరు సరఫరా అయితే తప్పా వరి పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. శ్రీరాంసాగర్ నుంచి నీటిని విడుదల చేయకపోతే వేలాది ఎకరాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కాబట్టి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

నీరు విడుదల చేయకుంటే పంటలన్నీ ఎండుతాయి..



● మేడిపెల్లి నారాయణ, రైతు, మునిపెల్లి

ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల చేయకపోతే పంటలన్నీ ఎండిపోతాయి. వరి పంట ప్రస్తుతం గింజ బలపడే దశలో ఉంది. ఈ సమయంలో నీరు చాలా అవసరం. నీరు అందకపోతే పూర్తిగా తప్పలు (ధాన్యపు గింజ లేకుండా) తయారవుతాయి. తద్వారా దిగుబడి తగ్గి రైతులంతా నష్టపోతారు. ఆలస్యంగా వేసిన పంటలైతే పూర్తిగా ఎండిపోయే అవకాశముంది. దీంతో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరుగుతుంది.

సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం..



● అడ్వాల పద్మ రమేష్, ఎంపీపీ, లక్ష్మణచాంద

సమస్యను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. వాస్తవంగా రబీ ప్రారంభంలో ప్రభుత్వం, అధికారులు ఎలాంటి ప్రణాళిక లేకుండా నీటిని విడుదల చేశారు. దీంతో నీరు వృథా పోయింది. ప్రస్తుతం పంట చేతికి రావాలంటే కనీసం 20 రోజులైనా నీటిని సరఫరా చేయాలి. లేదంటే రైతులు నష్టపోతారు. ఈ పరిస్థితిని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నీటిని విడుదల చేసేలా కృషి చేస్తాం.

పులి దాడిలో ఆవు మృతి

బెజ్జూరు, ఏప్రిల్ 7: మండలంలోని అటవీ ప్రాం తానికి మేతకు వెళ్లిన ఆవుపై పులిదాడి చేయడంతో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెద్దసిద్దాపూర్ గ్రామానికి చెందిన గుర్లెశంకర్ ఆవు శనివారం గ్రామసమీపంలోని అటవీప్రాంతానికి మేతకు వెళ్లితిరిగి రాలేదు. దీంతో అటవీప్రాంతంలో గాలించగా ఆదివారం మత్తడిఏరియాలో ఆవు కళేబరం కనిపించడంతో అటవీ అధికారులకు సమా చారం ఇచ్చారు. దీంతో బీట్‌అధికారులు అనిత, వెం కటేష్ సంఘటనస్థలాన్ని పరిశీలించి పులిదాడి చేయడంతో ఆవుమృతి చెందిందని నిర్ధారించారు. దీంతో తక్షణసాయం కింద సెక్షన్ అధికారి శ్రీనివాస్, బీట్‌అధికారి అనితబాధితుడికి రూ.5వేలు అందజేశారు.

చెక్‌పోస్టుల్లో నగదు పట్టివేత

సిర్పూర్(టి), ఏప్రిల్7: సిర్పూర్(టి) మండలం వెంకట్రావుపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.1.89 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లాకు చెందిన లోకిని గణేష్ మహారాష్ట్రలోని కుర్కడే నుంచి పెద్దపల్లికి నగదుతో వెళ్తుండగా తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలులేక పోవడంతో సీజ్ చేసి ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు తెలిపారు.

వాంకిడి: మండలంలోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.60వేల నగదును పట్టుకున్న ట్లు ఎస్సై సాగర్ తెలిపారు. జెండాగూడకు చెందిన జాడి అశోక్ కారులో ఆసిఫాబాద్ వైపు ఉంచి వాంకిడి వెళ్తుండగా అతనివద్ద రూ.60వేలు పట్టుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న అమర్‌సింగ్ తిలావత్

త్వరలో బంజారా రాజకీయ పార్టీ ఆవిర్భావం

● ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు

నేరడిగొండ, ఏప్రిల్ 7: తెలంగాణ రాష్ట్రంలో త్వరలోనే బంజార రాజకీయ పార్టీ ఆవిర్భవించనుందని ఆల్ ఇండియా బంజారసేవా సంఘం జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్ అన్నారు. మండలంలోని గౌలిగూడ గ్రామంలో మాజీ మంత్రి ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆదివారం బంజారా పొలిటికల్ ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పార్టీలకు అతీతంగా బంజారా నేతలు పాల్గొన్నారని అన్నారు. రాజ్యాధికారంలో బంజారా దమాషా ప్రకారం రాజకీయంగా వారికి రావాల్సిన సీట్లు రానందున, త్వరలో తెలంగాణ రాష్ట్రంలోనే బంజారా రాజకీయ పార్టీ ఆవిర్భావం చేసే విధంగా సమాలోచన చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రవీందర్‌నాయక్, ఐఏఎస్ విశ్రాంత ఉద్యోగి తేజావత్ రామచంద్రుడు నాయక్, మాజీ ఎంపీ రమేష్‌రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాపురావు రాథోడ్, ప్రొఫెసర్ పీహెచ్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఖమ్మం జిల్లా భట్టురాంజీ నాయక్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం జాతీయ కోశాధికారి భట్టు వెంకన్న, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి భట్టు నాగేశ్వర్‌రావు బీఏ(ఎల్), ఇచ్చోడ మాజీ ఎమ్మెల్యే కిషన్‌చౌహాన్, గౌలిగూడ జాలంసింగ్, రాజకీయ నాయకులు, కుల సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

'జయంతిని ఘనంగా జరుపుకుందాం'

తాంసి, ఏప్రిల్ 7: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని, ఉత్సవాలను పండుగలా జరుపుకునేందుకు అందరూ సహకరించాలని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ జయంతి నిర్వహణపై అంబేద్కర్ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ దళితుల అభ్యున్నతి కోసమే కాకుండా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం పని చేసిన మహనీయుడు అని కొనియాడారు. ఇందులో సంఘం మండల ప్రధాన కార్యదర్శి వాగ్మార్ కామరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు వావలకర్ శివాజీ, కాంబ్లే సునీల్, తదితరులు పాల్గొన్నారు.

తర్నం బ్రిడ్జి దగ్గర ఆటో బోల్తా

● ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

జైనథ్ రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని తర్నం బ్రిడ్జి దగ్గర శనివారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో జైనథ్ గ్రామానికి చెందిన ఇప్ప భారత్ మృతి చెందగా.. ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయని జైనథ్ మండల రూరల్ సీఐ సాయినాథ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఆటో నెంబర్ టీఎస్01యూసీ2036 గల ఆటో ఆదిలాబాద్ నుంచి జైనథ్ గ్రామానికి వెళ్తుండగా.. ఆటో డ్రైవర్ జక్కులవార్ రికేష్ మద్యం తాగి నిర్లక్ష్యంగా శిథిలావస్థకు చేరుకున్న తర్నం బ్రిడ్జిపై అనుమతి లేకుండా బ్రిడ్జిపై నుంచి తీసుకెళ్లాడు. ఇదే క్రమంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఇప్పభారత్‌పై ఆటో బోల్తాపడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ఆటోలో ఉన్న పుష్ప, పద్మలకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి అన్న ఇప్ప సుభాష్ ఫిర్యాదు మేరకు జైనథ్ రూరల్ సీఐ ఆటోను సీజ్ చేసి ఆటో డ్రైవర్ జక్కుల వార్ రికేష్ పై కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వమే

● ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ ● ఆయా మండలాల్లో పార్టీ కార్యకర్తల సమావేశం ● పలుచోట్ల పార్టీలో చేరికలు

తలమడుగు, ఏప్రిల్ 7: కారు పార్టీ పంచరై షెడ్‌లోకి వెళ్లిందని, అందరు బీజేపీలోకి వస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ లేదని, కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఖాయమని ఆదిలాబాద్ బీజేపీ పార్టీ అభ్యర్థి గోడంనగేష్ అన్నారు. మండలంలోని ఝురి గ్రామంలో ఆదివారం జరిగిన బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ఎన్నికల విషయమై దిశా నిర్దేశం చేశారు. అనంతనం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కారు పంచరై షెడ్‌లోకి వెళ్లిందని, బీఆర్ఎస్ పార్టీకి ఓటేసినా, గెలిచినా ఏమీ చేయలేదన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ సాధ్యంగానే హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. కేంద్రంలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ రావడం సాధ్యం కాదన్నారు. కేవలం బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం రానుందన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా గత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వ నిధులతో ముడిపడి ఉన్నవేనని, ఈ విషయం గురించి ప్రతీఒక్కరు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సంస్కృతికి, సంప్రదాయాలకు బీజేపీ ప్రభుత్వం పెద్దపీఠ వేసిందని తెలిపారు. ఇందులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, రైల్వేబోర్డు సభ్యులు జీవిరమణ, పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్‌చంద్ర, తాంసి జడ్పీటీసీ రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు స్వామి, సీనియర్ నాయకులు చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● **'ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేయాలి'**

కేంద్రంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రచారం నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకంలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందన్నారు. కార్యకర్తలు బూత్ స్థాయి నాయకులు ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు.

● **'రాముడికి గుడి కట్టిన ఘనత మోదీదే..'**

తాంసి: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ మండలస్థాయి కార్యకర్తల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పసి పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు దేశ ప్రధానిగా నరేంద్రమోదినే ముక్తకంఠంతో కోరుకుంటున్నారని అన్నారు. భౌగోళికంగా ఈ ప్రాంతంలోని అనువనువు తెలిసిన వ్యక్తిగా, ఈ ప్రాంతంలోని ప్రతి సమస్యపై అవగాహన ఉన్నదని ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత తనదని ఈ సందర్భంగా భరోసానిచ్చారు. 500ఏళ్లు గుడిసెలో ఉన్న రాముడికి గుడి కట్టిన ధీరుడు మోదీనేనని, అలాంటి మోదిని ముచ్చటగా మూడవసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే రథసారథులై ప్రచారాన్ని ముమ్మరం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రాహ్మనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ సుహాసినిరెడ్డి, తాంసి జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, వివిధ పదాధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తలమడుగులో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

● **బీజేపీలో పలువురు బీఆర్ఎస్ నాయకుల చేరిక**

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలువురు బీజేపీ పార్టీలో చేరారు. మండలంలోని పొన్నారి, తాంసి, గిరిగావ్, కప్పర్ల, గోట్కూరి గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ అభ్యర్థి నగేష్, సువాసినిరెడ్డిలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నరేంద్రమోది చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులైన తాము బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరుతున్నట్లు పలువురు ప్రకటించారు.

భీంపూర్: బీజేపీ ఎంపీ అభ్యర్థిగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడెం నగేష్ కోరారు. ఆదివారం భీంపూర్ మండలం అంతర్‌గాం గ్రామంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంపీగా గెలిపిస్తే ఆదిలాబాద్-కరంజి(టి) అంతర్‌రాష్ట్ర రోడ్డును జాతీయ రహదారిగా చేసి తీరుతానన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు భవిష్యత్తే లేదన్నారు. ఈ రెండు పార్టీల అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు అవుతాయన్నారు. దేశానికి మరోసారి ప్రధానిగా మోదీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, బీజేపీ జిల్లా నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, తాంసి జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు బజ్జీరి రాకేష్, ప్రధాన కార్యదర్శి అంకం అశోక్, ఎంపీటీసీ రెడ్డి రమేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు కోడిమెల దేవరెడ్డి, సవాయి స్వామి, రుద్ర గంగయ్య, గజానన్, సదానందం, పులి నారాయణలు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

'నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు'

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 7: నెంబర్ ప్లేట్లు లేకుండా, నెంబర్ ప్లేట్స్ వంచినా, అడ్డుగా స్టిక్కర్స్ వేసి వాహనదారులు తమ వాహనాలు నడిపితే సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై దుబ్బాక సునీల్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఎస్సై ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నెంబర్ ప్లేట్లు లేని పలు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు ముందు, వెనుక తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలన్నారు. నెంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడపడం, స్టిక్కర్స్ వేయడం, వంచడం, ట్రిపుల్ రైడింగ్, సౌండ్ పొల్యూషన్ వంటివి చేయడం చట్టరీత్యా నేరమన్నారు.



పరిశీలిస్తున్న ఆర్‌సీవో గంగాధర్

ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఇచ్చోడ, ఏప్రిల్ 7: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైనిక్ స్కూల్, కళాశాల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఇచ్చోడ మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రవేశ పరీక్షల్లో ఉదయం నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 248 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 202మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశ పరీక్షకు 152 మంది విద్యార్థులకు గానూ 119మంది విద్యార్థులు హాజరైనట్లు గురుకులాల ఆర్‌సీవో గంగాధర్, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌లు తెలిపారు.

'శనగల డబ్బులను చెల్లించాలి'

తాంసి, ఏప్రిల్ 7: శనగలు అమ్మి పక్షం రోజులు కావొస్తున్నా.. ఇంకా తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని పలువురు శనగ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ వారం రోజుల్లో తమ ఖాతాల్లో జమ అవుతాయని అనుకుంటే.. నేటికీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యమా? లేక మార్కెట్ ద్వారా నిధులు లేఖనా? అనే విషయంలో తాము ఆందోళన చెందుతున్నామని అన్నారు. పలుమార్లు స్థానిక సొసైటీ వద్దకు జిల్లాకేంద్రంలోని కార్యాలయానికి వెళ్లినప్పటికీ తమను ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. శనగలను అమ్మితే తమకు కొంత అప్పుల తిప్పలు తప్పుతాయని అనుకుంటే.. ఇప్పటి వరకు డబ్బులు అందలేదని అన్నారు. వెంటనే ప్రభుత్వం, యంత్రాంగం, ప్రభుత్వం స్పందించి డబ్బులు మంజూరు చేయాలని కోరారు. ఇందులో రైతులు విలాస్, వెంకటరెడ్డి, ప్రమోద్, సుశాంత్, నరసయ్య, రాములు, భూమారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, ఏప్రిల్ 7: రంజాన్ ఉపవాస దీక్షలో భాగంగా ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సమీపంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్నిపురస్కరించుకుని ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఇఫ్తార్ విందులో మండల కేంద్రంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.8 ၊ కనిష్ఠం 25.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
3
సోమవారం 8 ఏప్రిల్ 2024





● రాఘాపూర్ ప్రకృతి వనంలో వాడుముఖం పడుతునన మొక్కలు



● గుడిహత్నూర్‌లో అధ్వానంగా మారి కనిపిస్తున్న పల్లె ప్రకృతి వనం



● తలమడుగు మండలం బరంపూర్ పల్లె ప్రకృతి వనంలో నీటి సరఫరా లేక ఎండిపోతున్న మొక్కలు

పట్టుతప్పుతున్న.. పల్లె పాలన!

- జిల్లాలో రోజురోజుకూ కుంటుపడుతున్న గ్రామ ప్రగతి
- ఎండల తీవ్రతకు మైదాన ప్రాంతాలుగా మారుతున్న పల్లె ప్రకృతి వనాలు
- ఒక్కో ప్రకృతి వనానికి రూ.5లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధుల ఖర్చు
- నిరుపయోగంగా మారిన గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్లు
- క్షేత్రస్థాయిలో కొరవడుతున్న స్థానిక అధికారుల పర్యవేక్షణ
- గ్రామ పంచాయతీల పాలనపై ప్రత్యేకాధికారులకు పట్టింపు కరువు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 468 గ్రామ పంచాయతీల పరిధిలో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు

ఆదిలాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణాల మాదిరిగానే పల్లెల్లోనూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు ఎండుముఖం పడుతున్నాయి. నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నాయి. జిల్లాలో 468 గ్రామ పంచాయతీల పరిధిలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రకృతి వనానికి సుమారుగా రూ.5లక్షల నుంచి రూ.15లక్షల వరకు నిధులను ఖర్చు చేశారు. పల్లెల్లో ప్రగతిని పరుగులు పెట్టించేందుకు ఎన్నో నిధులను కేటాయించినా.. నిరుపయోగంగానే మారింది. అలాగే పంచాయతీల్లో అధికారుల కొరత లేకుండా ప్రతీ గ్రామానికి కార్యదర్శులను నియమించారు. అయినా పల్లె పాలన గాడిలో పడినట్లు కనిపించడం లేదు. గ్రామ ప్రగతిపై తప్పుడు నివేదికలు ఇస్తూ అధికారులు తప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోయి రెండు మాసాలు గడిచిపోతున్నా.. పాలనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. శాఖపరమైన విధులతో అధికారులు పల్లెపాలనపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీనికి తోడు లోక్‌సభ ఎన్నికల విధులతో అధికారులు బిజీబిజీగా మారారు. అసలే ఎండకాలం కావడంతో నీటి సరఫరా నిలిచిపోవడంతో పల్లె ప్రకృతి వనాలు కళ తప్పి మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసినా.. పల్లె ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగానే మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కనిపించని మొక్కలు

చాలా గ్రామాలలో మొక్కలు లేకుండానే పల్లె ప్రకృతి వనాలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో అడపాదడప మొక్కలు నాటినా.. వాటి సంరక్షణ చర్యలు చేపట్టక పోవడంతో కనిపించకుండానే పోయాయి. కొన్ని చోట్ల మొక్కలను నాటకుండానే తప్పుడు లెక్కలు నమోదు చేసి బిల్లులు కాజేసినట్లు తెలుస్తుంది. నాటిన చోట నిర్వహణ లేకపోవడంతో నేలపాలవుతున్నాయి. మొక్కల పేరిట యేటా లక్షల రూపాయలను జేబులో వేసుకుంటున్నా.. అడిగే నాథుడే కరువయ్యాడు. ప్రకృతి వనాల చుట్టు కంచెను ఏర్పాటు చేయక పోవడంతో పశువుల సంచారంతో పూర్తిగా ధ్వంసమై పోతున్నాయి. కొన్ని చోట్లనైతే అడవిలోనే పల్లె ప్రకృతి వనాల బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. గతంలో పల్లె ప్రగతి పేరిట కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎక్కడి ట్యాంకర్లు అక్కడే..

గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, నీటి ట్యాంకర్‌ను అందించింది. దీంతో చెత్త సేకరణ, మొక్కలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. కానీ చాలా గ్రామాల్లో నీటి ట్యాంకర్లు నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. వేసవి ప్రారంభమైనా.. నీటిని సరఫరా చేయకుండానే వదిలేస్తున్నారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో నిలిపి ఉంచిన చోటనే నెలల తరబడి కనిపిస్తున్నాయి. కేవలం సర్పంచ్‌లు చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం పనుల్లో నీటి ట్యాంకర్లను ఉపయోగిస్తున్నారు. కానీ మొక్కలకు నీళ్లందించిన దాఖలాలు కనిపించడం లేదు. మండు వేసవిలో మొక్కలకు నీటిని సరఫరా చేయకపోవడంతో ఎండుముఖం పడుతున్నాయి. ఇప్పటికే చాలా చోట్ల మొక్కలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఇకనైనా నీటి సరఫరా చేయకుంటే ఉన్న కాస్త మొక్కలు కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తుంది. కొన్ని గ్రామాల్లో నిర్వహణ బాగానే ఉన్నా.. చాలా గ్రామాల్లో ప్రకృతి వనాల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీ కార్యదర్శులు కూడా సక్రమంగా విధులకు హాజరుకాక పోవడంతో పల్లె ప్రగతి పనులు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. అన్ని గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నా.. ప్రకృతి వనాల జోలికి పోయినట్లే కనిపించడం లేదంటున్నారు.

కార్యాలయానికే పరిమితం

సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోవడంతో ప్రభుత్వం పంచాయతీ పాలన బాధ్యతను ప్రత్యేకాధికారులకు అప్పగించింది. దీంతో అధికారుల పర్యవేక్షణ లేక పల్లెపాలన పట్టుతప్పుతుందనే విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో జరుగుతున్న పల్లె ప్రగతి పనులను నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులే అసలు పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. మండలస్థాయి అధికారులు కార్యాలయానికే పరిమితం కావడంతో పంచాయతీ కార్యదర్శులు అడపాదడప విధులకు వస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో కిందిస్థాయి సిబ్బంది చెప్పిందే లెక్కగా మారింది. యేటా వానాకాలంలో మొక్కలను నాటడం, వదిలేయడంతో వేసవిలో వేల మొక్కలు నేలపాలవుతున్నాయి. మళ్లీ వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటి పంచాయతీ నుంచి 10శాతం నిధులను జేబులో వేసుకోవడం పరిపాటిగా మారింది. పంచాయతీ పాలనను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం జిల్లాకు లోకల్‌బాడీ అదనపు కలెక్టర్‌ను నియమించినా.. ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు.



గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించాం

: శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్

గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలతో పాటు నర్సరీలకు నిరంతరంగా నీటిని సరఫరా చేయాలని పంచాయతీ అధికారులకు ఆదేశించడం జరిగింది. వేసవి పరిస్థితుల దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని సరఫరా చేయాలి. చాలా గ్రామాల్లో నీటిఎద్దడి సమస్య వస్తుంది. అన్ని పంచాయతీల్లో నీటి ట్యాంకర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

నేడు బూత్‌లెవల్ కోఆర్డినేటర్ల సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 7: ఈనెల 8న ఉదయం 10గంటలకు పట్టణంలోని రత్నాగార్డెన్‌లో కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్స్ కో ఆర్డనేటర్ల సమావేశం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథులుగా పార్లమెంట్ ఇన్‌చార్జీ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజులు హాజరవుతున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల మేనేజ్మెంట్ ఏ విధంగా చేయాలని అని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయడానికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ జాతీయ కోఆర్డినేటర్ కొప్పుల రాజులు ఆదిలాబాద్ పట్టణంలోని రత్నగార్డెన్‌లో ఈ నెల 8న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారు. అయితే పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడె గజేందర్ కోరారు.

.. విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీంపూర్, ఏప్రిల్ 7: మండలంలో ప్రీ మాన్సూన్ పనుల కారణంగా 33 కేవీ పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శ్రావణకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

12న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

ఉట్నూర్, ఏప్రిల్ 7: మండలంలోని సాలెవాడబిలో ఈనెల 12న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ నాయకులు తెలిపారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు గణపతి పూజ పురావచనము, సాయంత్రం ఐదు గంటలకు జలది నివాసం, 11న ఉదయం గణపతిపూజ నవగ్రహా ఆరాధానతో పాటు తదితర పూజలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే, 12న ఉదయం 5.30 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, కలశ స్థాపన, 10.30కు నవ గ్రహణం ఆవునము పూర్ణాహుతి క్షేత్ర పాలపల్లి పూజలు ఉంటాయన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు పురస్కరించుకుని ఉదయం 10గంటల నుంచి విష్ణు మహరాజ్ ప్రవచనాలు, మధ్యాహ్నం 2గంటల నుంచి 3 గంటల వరకు జైవంత్‌రావు మహరాజ్ ప్రవచనాలు ఉంటాయన్నారు. 11న వినాయకరావు మహరాజ్ ప్రవచనాలు కలశ స్థాపన, 12న రాంసింగ్ మహరాజ్, కోరంగ యశ్వంత్‌రావు మహరాజ్, సురేష్ మహరాజ్‌ల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వారసంతలో జోరుగా కల్తీ దందా!

● ఇచ్చోడ వారసంతలో నాసిరకం సరకుల విక్రయాలు ● అయినా పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



వారసంతలో నాసిరకం పచ్చడిని విక్రయిస్తున్న వ్యాపారులు



మార్కు సంచులలో తీసుకువచ్చిన పొడులను కవర్లలో నింపి ఇస్తున్న ఓ వ్యాపారి



అగ్‌మార్క్ గుర్తు లేని అగర్‌బత్తులను బహిరంగంగా అమ్ముతున్నారిలా..

ఇచ్చోడ, మార్చి7: మండల కేంద్రంలోని వారానికోసారి ప్రతీ సోమవారం నిర్వహించే వారసంతలో నిత్యావసర సరకులు, ప్రభుత్వం అమోదించిన అగ్‌మార్క్ గుర్తులతో సరుకుల పొట్లాలను విక్రయించాల్సి ఉండగా.. విడివిడిగా నాసిరకం పొడులను వ్యాపారులు బహిరంగంగా విక్రయిస్తున్నారు. దీనిలో భాగంగా నిత్యావసర సరుకులైన కారంపొడి, నూనె, పుప్పు దినుసులు, టీ పొడులు, వివిధ రకాల మసాలాలు నాసిరకం సరుకులు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏజెన్సీ కేంద్రమైన ఇచ్చోడలో అమాయకపు గిరిజనులు కాస్త చౌకగా లభించడంతో అవగాహన లేక వాటిని కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. చిరు వ్యాపారం పేరుతో కొందరు కల్తీ సరకుల విక్రయాలను వారసంతల్లో దర్జాగా విక్రయిస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నేరడిగొండ, బోథ్, గుడిహత్నూర్, సరికొండ, సిరిచెల్మ వారసంతల్లోనూ ఇదే తీరుగా నాసిరకం సరకుల విక్రయాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మామూలుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీల ప్రత్యేక పూజలు



ఆలయంలోప్రత్యేక పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 7: ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పిస్తున్నారు. త్వరలో పెళ్ళిళ్ళు నిర్వహించే కుటుంబీకులు ముందుగా ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఇంద్రాదేవి ఆలయంలో మొక్కులు చెల్లించి పెళ్ళి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. ఆదివారం మండలంలోని పొల్లుగూడ, తలమడుగు, మండలంలోని పల్లి బి గ్రామంతో పాటు ఉట్నూర్, నార్నూర్ మండలంలోని పలు గ్రామాల ఆదివాసీలు ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆదివాసీ పెద్దలు ఆత్రం శంకర్, పెందోర్ మారుతి, జుగ్నాక్ మహాదు సిడాం, దశరథ్, కోరెంగా జుగాదిరావు తదితరులు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

నేరడిగొండ, ఏప్రిల్ 7: బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రజలను కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారాసా మునిగిపోయే నావా అని, కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కి ఒక్క హామీ కూడా నేరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఏర్పడుతుందని ప్రధాని నరేంద్రమోదీ అవ్వబోతున్నారని, బీజేపీ ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ఈసారి 400 సీట్లు గెలువబోతుందని జోస్యం చెప్పారు. ఈ 400 సీట్లలో ఆదిలాబాద్ పార్లమెంట్ కూడా ఉండబోతుందని, 3లక్షల మెజార్టీతో గోడం నగేష్ గెలువబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మస్తపురే అశోక్, ప్రధాన కార్యదర్శులు సాబ్లె సంతోష్‌సింగ్, సోలంకి ప్రశాంత్, బంటు ప్రవీణ్, నాయకులు రాములు, నారాయణ, నవీన్, పరశురాం, భీంరావ్, కమల్‌సింగ్, కేవల్‌సింగ్, రవి, నవీన్, జమీర్, అశోక్, రంజిత్, గంగాధర్, శ్రీను, భూమేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

కురిసిన జల్లులు.. చల్లబడిన వాతావరణం

ఆదిలాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటి వరకు ఠారెత్తించిన ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. కాగా, ఆదివారం ఉదయం కురిసిన చిరుజల్లులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ఎండల తీవ్రత నుంచి కొంత వరకు ఉపశమనం కలిగింది. జిల్లావ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై కనిపించింది. జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 41.8 నమోదు కాగా, కనిష్ఠంగా 25.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 4గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. పలుచోట్ల ఈదురుగాలుల ప్రభావానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



వేడుకల్లో పాల్గొన్న కరంజి(కె) గ్రామస్థులు

ముగిసిన బాబా సప్తాహ వేడుకలు

జైనథ్ రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని కరంజి(కె) గ్రామంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న బాజీరావుబాబా సప్తాహ వేడుకలు ఆదివారం ముగిశాయి. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కరంజి(కె) గ్రామంలో బాజీరావు బాబా సప్తాహం ముగింపు వేడుకలను మహిళలు మంగళహారతులు, వివిధ నృత్యాలతో నిర్వహించారు. వివిధ దేవత వేషధారణలతో చిన్నపిల్లలను అలంకరించి అన్ని హంగులతో అలంకరించబడిన ఎడ్లబండిపై డప్పులు, భాజాలు, భజనల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్కి గంగన్న మాట్లాడుతూ సమాజంలోని ప్రతిఒక్కరూ తమకు ఉన్న చెడు వ్యసనాలను వీడాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అలాగే బాజీరావు బాబా చూపిన సన్మార్గంలో అందరూ నడవాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఏనుగు రతన్‌రెడ్డి, గ్రామపెద్దలు గోరే మాదవ్, గంగారాం రెడ్డి, బిక్కి పోచ్చన్న, మహేందర్‌రెడ్డి, బొల్లం అశోక్, మేకల పెంటాజి, లచ్చారెడ్డి, గ్రామ ప్రజలు, మహిళలు, బాబా శిష్యులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్	సహర్
సా.6.36	ఉ.4.42



దైవం నిషేధించిన వాటికి దూరంగా ఉండండి. మీరు వాటిని త్యజిస్తే మీకన్న గొప్ప దైవభక్తులు మరొకరు ఉండరు.